# జీవనోపాధులు ... భవితవ్యం

నవంబర్ 2013


ఎందరో మహానుభావులు...

# వర్గీస్ కురియన్

పపంచంలో సహకార ఉద్యమానికి పేరు తెచ్చిన వారిలో ఒకరైన కురియన్ (26 నవంబర్, 1921 – 9 సెప్టెంబర్, 2012) దేశంలోని ప్రముఖ సామాజిక ఎంటర్‌ప్రెన్యూర్లలో ఒకరు. ఆపరేషన్ ఫ్లడ్ పేరిట చేపట్టిన 'బిలియన్ లీటర్ ఐడియా'కు గాను ఆయనను దేశ "క్షీరవిప్లవ పితామహుడి"గా పేర్కొంటారు.



'భారతదేశంలోని గ్రామీణుల జ్ఞానము, వృత్తినిపుణుల యొక్క నైపుణ్యాల కలయిక వల్లే ఈ విశ్వంలో భారతదేశం పేరు చరిత్రలో నిలిచిపోతుంది' - డాక్టర్ వర్ఘీస్ కురియన్.

ఇది - దేశంలో సహకార ఉద్యమాన్ని నిర్మించి, పేద రైతుల జీవితాలలో మార్పు తీసుకువచ్చి, భారతదేశాన్ని పాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కలిగిన దేశంగా తీర్చిదిద్దిన కాలికట్‌కు చెందిన డాక్టర్ వర్ఘీస్ కురియన్ అనే ఒక యువ ఇంజనీరు కథ.

ప్రపంచంలో సహకార ఉద్యమానికి పేరు తెచ్చిన వారిలో ఒకరైన కురియన్ (26 నవంబర్, 1921 - 9 సెప్టెంబర్, 2012) దేశంలోని ప్రముఖ సామాజిక ఎంటర్‌ప్రెన్యూర్లలో ఒకరు. ఆపరేషన్ ఫ్లడ్ పేరిట చేపట్టిన 'బిలియన్ లీటర్ ఐడియా'కు గాను ఆయనను దేశ క్షీరవిప్లవ పితామహుడిగా పేర్కొంటారు.

**క్షీరవిప్లవం.** ఈ కార్యక్రమం భారతదేశాన్ని పాలకొరత ఎదుర్కొంటున్న స్థాయి నుంచి ప్రపంచంలో పాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాలలో ఒకటిగా నిలిపి, 1998లోనే పాల ఉత్పత్తిలో మనం అమెరికాను దాటిపోయేలా చేసింది. 2010-11లో మొత్తం ప్రపంచంలోని పాల ఉత్పత్తిలో మన దేశం వాటా 17 శాతం. అంటే మూడు దశాబ్దాల కాలంలో వ్యక్తిగత తలసరి వినియోగం రెండు రెట్లయిందన్నమాట. ఈ కాలంలో పాడిపరిశ్రమ భారతదేశపు అతి పెద్ద స్వయంసమృద్ధి కలిగిన పరిశ్రమగా రూపుదిద్దుకుంది. ఆ తర్వాత కురియన్ అతి శక్తివంతమైన నూనె సరఫరా లాబీని ఎదిరించి, మన దేశం వంటనూనెల ఉత్పత్తిలో కూడా స్వయం సమృద్ధి సాధించేలా చేశారు.

జాలరుల సహకార సంఘాలు, పశుపోషకుల సహకార సంఘాలు, కలపేతర అటవీ ఉత్పత్తుల సహకార సంఘాలు, రైతు సహకార సంఘాలు, పొదుపు, రుణ సహకార సంఘాలు, వ్యవసాయ యూనియన్లు, స్వయం సహాయక బృందాలు, సమాఖ్యలు మొదలైన దాదాపు 30 సంస్థలను కురియన్ స్థాపించారు.

కురియన్ దాదాపు 60 ఏళ్ల పాటు పేద ప్రజల సంస్థలను నిర్మిస్తూ, వాటిని బలోపేతం చేస్తూ జీవించారు. ఒక అద్భుతమైన సామాజిక ఎంటర్‌ప్రెన్యూర్ అయిన కురియన్, 'AMUL' పేరిట చిన్న, సన్నకారు పాడి రైతుల పరిశ్రమను అభివృద్ధి చేశారు. ఇది దేశంలోనే పేరెన్నికగన్న ప్రజా పారిశ్రామిక నమూనాగా పేరు పొందింది. ఆయన ఇదే నమూనాను కూరగాయల, నూనె గింజల ఉత్పత్తిలో కూడా అమలు చేయడానికి ప్రయత్నించారు. సహకారసంస్థలు మూడు పనులు చేయాలని ఆయన నమ్మేవారు.




1.ఉత్పత్తి విలువ గొలుసులో దళారులను నిర్మూలించడం.

2. సేకరణ, శుద్ధి చేయడం, మార్కెటింగ్‌లలో సభ్యుల ప్రమేయం ఉండేలా చూడడం.

3. సహకార సంఘం కార్యకలాపాలలో వృత్తినైపుణ్యతను నెలకొల్పడం.

AMUL లో ఈ లక్షణాలను అభివృద్ధి చేయడం కోసం ఆయన అనేక దశాబ్దాల పాటు కృషి చేశారు. రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్ల జోక్యం వల్లే సహకార సంఘాలు భ్రష్టు పట్టాయని విశ్వసించే ఆయన, సహకార సంఘాల నిర్వహణలో వారిని దూరంగా పెట్టడానికి నిరంతరం శ్రమించారు. యాజమాన్య నిర్వహణలో కార్పొరేట్ బోర్డు సభ్యులు, వృత్తి నిపుణుల పాత్రలను ఆయన వేర్వేరుగా ఉంచారు. బోర్డు సభ్యులు తమ పాత్రను విధానాల రూపకల్పనకు పరిమితం చేసుకోవాలని, సహకార సంఘాల నిర్వహణ భారాన్ని వృత్తి నిపుణులకు వదిలేయాని, వారు కార్పొరేటివ్ బోర్డు సభ్యులకు జవాబుదారీగా ఉంటారని ఆయన విశ్వసించేవారు. ఆయన ఇవన్నీ AMULలో ఆచరించి చూపారు.

కురియన్ కేరళలో కాలికట్ (ప్రస్తుత కోజికోడ్)లోని ఓ సిరియన్ క్రైస్తవ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఓ సివిల్ సర్జన్. ఆయన మద్రాస్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పట్టా పొందారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఆయన, జంషెడ్‌పూర్‌లోని టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి 1946లో తన చదువును కొనసాగించారు. ఆ తర్వాత పై చదువులు చదివేందుకు ఆయన మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీలో ప్రభుత్వ నిధులతో చదువుకునే అవకాశమున్న మాస్టర్స్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ రంగంలోనే తన చదువు కొనసాగించేందుకు అంగీకరించాలని ఆయన ఒత్తిడి తెచ్చినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఆయనకు డెయిరీ ఇంజనీరింగ్‌లోనే సహాయం చేస్తామని స్పష్టం చేసింది. విదేశాలలో మాస్టర్స్ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకున్నపుడు ఇంటర్వ్యూ చేసే వ్యక్తి ఆయనను, "పాశ్చరైజేషన్ గురించి నీకేం తెలుసు?" అని ప్రశ్నించాడు. దీనికి కురియన్ ఇచ్చిన సమాధానం ఏమిటో తెలుసా? "అదేదో పాలకు సంబంధించింది. అంతేనా?"

ఇది జరిగింది 1946లో. ఎంపీ కామత్ రచించిన ఆనంద్: ద స్టోరీ ఆఫ్ వర్ఘీస్ కురియన్ అన్న పుస్తకంలో తనకు మెటలర్జీలో మాస్టర్స్ డిగ్రీ

చదివేందుకు అనుమతించాలని కోరిన కోర్కెను నిరాకరిస్తూ ప్రభుత్వం, కురియన్ డెయిరీ ఇంజనీరింగ్‌లోనే మాస్టర్ డిగ్రీ చదవాలని నిర్ణయించిన విధానాన్ని రచయిత వివరిస్తారు.

అయితే మిచిగాన్ యూనివర్సిటీలో డెయిరీ ఇంజనీరింగ్ లేకపోవడంతో, కురియన్ మెటలర్జీ, ఫిజిక్స్ చదవడానికి అవకాశం లభించింది. ఆయన 1948లో భారతదేశానికి తిరిగి వచ్చినపుడు, ఆయనను గుజరాత్‌లోని ఆనంద్ అనే చాలా తక్కువ మందికి తెలిసిన ఒక గ్రామానికి పంపారు. అక్కడ ఆయన రెండేళ్ల బాండ్‌తో, నెలకు 6 వందల రూపాయల జీతం మీద ఒక వెన్న, జున్ను తయారు చేసే ప్రభుత్వసంస్థలో పని చేశారు. అక్కడ పని ఎక్కువగా లేకపోవడంతో విసిగిపోయిన కురియన్, తన సంకెళ్లు తెగిపోయే సమయం కోసం ఎదురు చూడసాగాడు. ప్రతి నెలా కురియన్ అక్కడ తనకు పని లేదనీ, అందువల్ల రాజీనామా చేస్తానని ప్రభుత్వానికి లేఖ రాసేవాడు. అయితే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాడు కానీ రాజకీయాలు, దేశభక్తి, వృత్తిపరమైన సవాళ్ల కారణంగా, కురియన్ అదే పనిలో దేశంలో సహకార సంఘాలకే నమూనాగా నిలిచిన అమూల్‌తో చివరి వరకు కొనసాగాడు.

కురియన్ ఆనంద్‌కు వచ్చిన సమయంలోనే అక్కడ సన్న, చిన్నకారు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పాలను సమర్థంగా మార్కెట్‌కు తీసుకుపోవడంలో విఫలమైన వారు - దబ్బు, వనరులు, ప్రభుత్వ అధికారులతో సంబంధమున్న పెద్ద డెయిరీల చేతిలో తరచుగా దోపిడీకి గురయ్యేవారు. అప్పట్లో గుజరాత్‌లోని ఆనంద్‌లో మాత్రమే 1930లో స్థాపించిన 'పోల్సన్ డెయిరీ' అనే డెయిరీ ఉండేది. పోల్సన్ డెయిరీ సమాజంలోని ఉన్నత వర్గాల వారికి ఉన్నతశ్రేణి డెయిరీ ఉత్పత్తులను అందించేది. అయితే సరైన ధరలు చెల్లించకుండా, వారు ఇతర ఉత్పత్తిదారులకు అమ్ముకోకుండా అది రైతులను ఇబ్బంది పెట్టేది. దీనికి ప్రతిఘటనగా ఆ దశాబ్దపు ప్రారంభంలో అక్కడి రైతులు త్రిభువన్‌దాస్ పాటిల్ ఆధ్వర్యంలో మొదటి సహకార సంఘాన్ని ప్రారంభించారు. మొదట్లో అది ఎలాంటి సరఫరా నెట్‌వర్క్, సరఫరా గొలుసు సదుపాయాలు లేకుండానే పాలను, డెయిరీ ఉత్పత్తులను సరఫరా చేసేది. అప్పట్లో AMUL అన్న బ్రాండ్ నేమ్ ఇంకా రాలేదు. KDCMPUL (ఖైరా జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్ లిమిటెడ్) అన్న పేరుతో దాన్ని పిలిచేవారు. మొదట అది రోజుకు 247 లీటర్ల పాలతో రెండు సహకార సంఘాలుగా ప్రారంభమైంది. అదే తర్వాత 1946లో కురియన్ AMUL పేరుతో సహకార సంఘాన్ని ప్రారంభించడానికి దారి తీసింది.



ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయినవాడు కురియనే. తన ఉద్యోగం పట్ల అసంతృప్తి, ఒంటరితనం- ఆయన స్థానిక రైతులకు, త్రిభువన్‌దాస్‌కు చేరువ కావడానికి దారి తీసాయి. ఆ సహకార సంఘం చేస్తున్న కృషి, దిక్కుతోచని రైతుల స్థితి కురియన్‌లో పట్టుదల రేకెత్తించాయి. అందువల్ల ఆ సహకార సంఘాన్ని విస్తృతం చేయాలని కోరినపుడు కురియన్ వెంటనే అందుకు అంగీకరించారు. ముందుగా రూ.60 వేలతో ఒక పాశ్చరైజేషన్ యంత్రాన్ని కొనాలని ఆయన ప్రతిపాదించారు. అది చాలా ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ, దాని వల్ల వారికి చాలా మేలు జరిగింది. దీని వల్ల పాలు పాడవకుండా ముంబైకు రవాణా చేయడం వీలైంది. దీంతో వారి సహకార సంఘం క్రమంగా పుంజుకోవడం ప్రారంభమైంది.

ఈ విజయం వార్త ఆ ప్రాంతమంతటా పాకడంతో, ఇతర జిల్లాల రైతులు కూడా అక్కడికి రావడం, వారి విజయాన్ని పరిశీలించడం, కురియన్‌తో మాట్లాడటం ప్రారంభమైంది. ఇలా వచ్చేవారిలో ఎక్కువ మంది భూమిలేని కూలీలుండేవారు. వారి ఆస్తి మొత్తం ఒక ఆవు, గేదె అయి ఉండేది. గేదె పాలను స్కిమ్ పౌడర్ లేదా ఘనరూపంలోని పాలగా మార్చే యంత్రాన్ని కనిపెట్టిన హెచ్.ఎమ్.దలయా వారి ఉద్యమానికి మరింత ప్రాచుర్యం కల్పించారు. ఈ సంచలన ఆవిష్కరణతో దేశంలో లభించే బర్రె పాలనన్నిటినీ సహకార సంఘాలు సమర్థంగా వినియోగించుకోవడానికి అవకాశం లభించి, అవి కేవలం ఆవు పాలమీద ఆధారపడి నడిచే బహుళజాతి కంపెనీలతో పోటీ పడడానికి వీలైంది.

కురియన్ త్రిభువన్‌దాస్‌తో కలిసి ఖేడా జిల్లాలో సహకార సంఘాలను నెలకొల్పారు. ఈ సహకార సంఘాలు గ్రామాల్లోని రైతుల నుంచి రోజుకు రెండుసార్లు పాలను సేకరించేవి. ఆ పాలలోని కొవ్వు శాతానికి అనుగుణంగా వారికి చెల్లింపులు జరిగేవి. కొవ్వును కొలిచే యంత్రాలు, హఠాత్తుగా నిర్వహించే చెకింగ్, పాల సేకరణపై రైతులకు అవగాహన పెంచడం తదితర కార్యక్రమాల ద్వారా అక్రమాలు అరికట్టడానికి, మొత్తం కార్యకలాపాలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేసేవారు. ఇలా సేకరించిన పాలను అదే రోజు దగ్గరలోని పాల శీతలీకరణ కేంద్రానికి సరఫరా చేసేవారు. అక్కడ కొన్ని గంటలపాటు నిలువ చేసిన అనంతరం, దానిని పాశ్చరైజేషన్ కొరకు, ఆ తర్వాత చివరగా శీతలీకరణ మరియు ప్యాకేజింగ్ యూనిట్‌కు తరలించేవారు. ఆ తర్వాత ఆ పాలు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్‌కు, రెండంచెల మార్కెటింగ్ పద్ధతుల ద్వారా అక్కడి నుంచి చిల్లర వర్తకులకు, చివరగా వినియోగదారుల చెంతకు చేరేవి. ఈ పైస్థాయి సరఫరా గొలుసును

మొత్తం కురియన్, త్రిభోవన్‌దాస్‌లే రూపుదిద్దారు. దీనివల్ల ఆ సహకార వ్యవస్థ రోజురోజుకీ మెరుగుపడడం ప్రారంభమై, చివరికి 1960లో అమూల్ గుజరాత్‌లో విజయానికి పర్యాయపదంగా మారింది.

KDCMPULకి సులభంగా ఉండేలా, అందరి నోళ్లలో నానేలా ఒక ప్రత్యేకమైన పేరును ఇవ్వాలని కురియన్ నిర్ణయించారు. ఒక మంచి పేరు సూచించమని ఉద్యోగులు, రైతులను కోరడం జరిగింది. ఒక క్వాలిటీ కంట్రోల్ సూపర్‌వైజర్ అమూల్య అన్న పేరును సూచించాడు. సంస్కృత పదమైన అమూల్య అంటే వెల కట్టలేనిది, అంటే సాటిరానిది. ఆ తర్వాత యూనియన్ పేరు కూడా వచ్చేలా ఈ పేరును AMULగా మార్పు చేశారు. అలా నేటి బ్రాండ్‌నేమ్ – AMUL – ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ వాడుకలోకి వచ్చింది.

అమూల్ సాధించిన భారీ విజయంతో ఆ ప్రాంతం, కురియన్ ప్రభుత్వం దృష్టిలో పడ్డారు. క్రమంగా ఆ సంస్థ దేశంలోనే భారీ ఆహారోత్పత్తుల బ్రాండ్‌గా రూపుదిద్దుకున్నా, కురియన్ ఆనంద్‌లోనే ఉండిపోయారు. అక్కడ ఆయన స్థానిక ప్రజల మన్నన చూరగొంటూ, జాతీయ రాజకీయాలకు దూరంగా ఉండేవారు.

ఆపరేషన్ ఫ్లడ్ – క్షీరవిప్లవం. 1964లో నాటి ప్రధానమంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిని ఆనంద్‌లోని కొత్త పశుదాణా ప్లాంట్‌ను ప్రారంభించడానికి ఆహ్వానించారు. దానిని ప్రారంభించాక ఆయన అదే రోజు తిరిగి వెళ్లాల్సి ఉండింది. కానీ ఆయన అక్కడే కొంతసేపు ఉండి, ఆ సహకార ఉద్యమ విజయాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రాంతంలోని దాదాపు అన్ని సహకార సంస్థలనూ కురియన్‌తో పాటు కలిసి పరిశీలించిన శాస్త్రి, AMUL రైతుల నుంచి పాలను సేకరిస్తున్న విధానం, అదే సమయంలో దాని వల్ల వారి ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పుల పట్లా సంతృప్తి చెందారు. ఆ తర్వాత ఢిల్లీకి వెళ్లి, అమూల్ తరహాలోనే సహకార ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని కురియన్‌కు విజ్ఞప్తి చేశారు. వీరిద్దరి కృషి వల్ల 1965లో జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు (NDDB) ఏర్పాటైంది. NDDB బాధ్యతలు స్వీకరించిన కురియన్, అమూల్ నమూనాను దేశవ్యాప్తంగా విస్తరించడం అనే బృహత్కార్యాన్ని చేపట్టారు. ఇదే సమయంలో దేశంలో పాల ఉత్పత్తి కంటే డిమాండ్ పెరగడం ప్రారంభమైంది. NDDB, భారత ప్రభుత్వం కలిసి అప్పుడే తగిన చర్యలు తీసుకోనట్లైతే మన దేశం కూడా శ్రీలంక మాదిరిగా పాలను అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో ఒకటిగా మారి ఉండేది.



ఆ సమయంలో NDDBకి నగదు కొరత తీవ్రంగా ఉండేది. పాల పరిశ్రమలో సమూల మార్పులు రావాలంటే సొమ్ము లేనిదే పని జరగదు. ఇందుకోసం NDDB ఎలాంటి షరతులూ లేని రుణాలు, ఇతర గ్రాంట్ల కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించాలని నిర్ణయించుకుంది. 1969లో ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు భారతదేశానికి వచ్చినపుడు ఆయనను కలిసిన కురియన్, "నాకు డబ్బులు ఇవ్వండి, ఆ తర్వాత దాని గురించి మరచిపోండి" అని విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే ప్రపంచ బ్యాంక్ ఒక్క షరతూ లేకుండా NDDBకి లోన్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఇదే తర్వాత కాలంలో ఆపరేషన్ ఫ్లడ్ కార్యక్రమంగా రూపుదిద్దుకుంది.

1973లో డాక్టర్ కురియన్ దేశం పాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించేలా ఆపరేషన్ ఫ్లడ్ లేదా క్షీరవిప్లవానికి రూపకల్పన చేశారు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలను నిర్మించిన కురియన్, గుజరాత్ పాల సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ (GCMMF) పేరిట వాటన్నిటి ఉత్పత్తులనూ ఒకే బ్రాండ్‌నేమ్‌తో దేశం లోపల, బయట విక్రయించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆపరేషన్ ఫ్లడ్‌ను ఆయన మూడు దశలలో దేశవ్యాప్తంగా విస్తరించారు. దీని వల్ల దేశంలో సుమారు 50 లక్షల మంది పాల ఉత్పత్తిదారులతో లక్ష సహకార సంఘాలు ఏర్పడ్డాయి.

సహకార ఉద్యమం బలహీనం కావడానికి వాటి నిర్వహణలో వృత్తి నైపుణ్యాలు కొరవడడమే అని కురియన్ గుర్తించారు. సహకార ఉద్యమం అభివృద్ధి చెందాలంటే వృత్తి నిపుణుల అవసరం ఎంతైనా ఉందని ఆయన విశ్లేషించారు. మొదట ఆయన అలాంటి వృత్తి నిపుణులు కొందరిని కొన్ని పేరొందిన సంస్థల నుంచి తీసుకున్నారు. అయితే ఈ ప్రొఫెషనల్స్ సహకార సంఘాల కోసం పని చేయడంలో ఆయన కొన్ని సమస్యలు ఎదుర్కొన్నారు. అందువల్లే ఆయన వృత్తి నిపుణులను తయారు చేయడం కోసం తానే శిక్షా డెయిరీ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించారు. ఆ తర్వాత1979లో అదే IRMA – ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్‌గా రూపు దిద్దుకుంది. ఇక్కడ తయారైన వృత్తి నిపుణులు తమ విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించి, గ్రామీణ భారతాన్ని భారత చిత్రపటంపై ఉన్నత స్థానంలో ఉంచారు. పాలపొడిని తయారు చేయడం, అనేక రకాలైన డైరీ ఉత్పత్తులు, పశువుల ఆరోగ్యం కోసం అనేక రకాలైన వ్యాక్సిన్లను తయారు చేయడం లాంటి అనేక ఇతర కార్యక్రమాలను కూడా కురియన్ తన హయాంలో చేపట్టారు.

ఈ ప్రయత్నాలన్నింటి వల్ల అమూల్ ఖాతాలో నేడు 1 కోటి 50 లక్షల పాల ఉత్పత్తి దారులు, 1,44,246 పాడి పరిశ్రమ సొసైటీలున్నాయి. ఈ విస్తృతమైన సరఫరా గొలుసు వల్లే నేడు మన దేశం పాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాల జాబితాలో స్థానం పొందింది.

తాను విజయవంతంగా స్థాపించిన అమూల్ గురించి చెబుతూ – ఆపరేషన్ ఫ్లడ్‌ను ప్రారంభించడం వెనుక ఉన్న కారణాలను, దేశాన్ని

పాలఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దేశంగా నిలపాలన్న తపనను, అది ఎందువల్ల విజయవంతమైందీ ఆయన వివరించారు. ఈ మొత్తం విషయాన్ని ఆయన క్లుప్తంగా ఇలా వివరిస్తారు: "గత 20 ఏళ్ల కాలంలో దేశంలో పాల ఉత్పత్తి మూడింతలైంది. అది ఏడాదికి 20 మిలియన్ టన్నుల నుంచి 60 మిలియన్ టన్నులకు పెరిగింది. ఒక టన్ను పాల విలువ ఎంత? లీటరుకు ఆరు రూపాయల వంతున పెరిగిన పాల ఉత్పత్తుల ధర రూ.2,400 కోట్లు. దీనికి అదనంగా మరో రూ.2,400 కోట్లు ప్రతి సంవత్సరం గ్రామస్తులకు అందుతోంది. ఇదంతా గత 20 ఏళ్ల కాలంలో జరిగింది. దీనికి కారణం ఆపరేషన్ ఫ్లడ్ I, II, III. దీనిపై మొత్తం పెట్టుబడి రూ.2,000 కోట్లు. అది కూడా ప్రభుత్వ పెట్టుబడి కాదు. పెట్టుబడికి, రాబడికి మధ్య ఉన్న వ్యత్యాసం చాలా పెద్దది. ఈ సొమ్ము ఒకటి, రెండు గేదెలు ఉన్నవారికి, చిన్న, సన్నకారు రైతులకు, భూమిలేని కూలీలకు కూడా చేరుతోంది. నేడు మన దేశంలో పాడి పరిశ్రమ అతి పెద్ద గ్రామీణ ఉపాధి కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. మాది ఒక ప్రభుత్వ సంస్థ అయినా, సంస్థ కార్యకలాపాలలో ప్రభుత్వజోక్యం చాలా తక్కువగా ఉంది."

కురియన్ నిరంతరం నాణ్యత కోసం పట్టుబట్టేవారు. అమూల్ ఉత్పత్తులు నాణ్యతకు పర్యాయపదమయ్యేలా ఆయన జాగ్రత్త వహించేవారు. నాణ్యత విషయంలో ఆయన ఎన్నడూ రాజీ పడేవారు కాదు. పాల నాణ్యతను బట్టి వాటికి చెల్లింపులు ఉండేలా చూసేవారు. ఉత్పత్తుల తయారీలో ఆయన ఎన్నడూ అక్రమాలు జరగడాన్ని సహించేవారు కాదు. అమూల్ ఉత్పత్తులపై వినియోగదారులకు ఉన్న విశ్వాసాన్ని ఎన్నడూ కోల్పోరాదనీ, అమూల్ ఉత్పత్తులను కొన్నందుకు వారెన్నడూ పశ్చాత్తాపపడరాదనీ ఆయన అనేవారు.

సహకార సంఘాలను సమర్థంగా నిర్వహించడానికి పాల సేకరణ, నాణ్యతా పరీక్షలు, మార్కెటింగ్, బుక్ కీపింగ్, ఆడిటింగ్, సిబ్బందిపై పర్యవేక్షణలో నైపుణ్య సామర్థ్యాలను పెంచాల్సి ఉందనీ, వాటిని క్రమం తప్పకుండా చేయాలనీ ఆయన భావించేవారు. సహకార సంఘాల సుస్థిర అభివృద్ధిలో వాటిపై సభ్యుల నిర్వహణ ఒక కీలకాంశమని ఆయన అనేవారు. రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్ల జోక్యం వల్ల సహకార సంఘాలు దెబ్బ తింటాయని ఆయన భావించేవారు. మన ఎదురుగా కనిపిస్తున్న విఫలమైన అనేక సహకార సంఘాలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. సహకార సంఘాల నిర్వహణలో కురియన్ ఎన్నడూ రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్ల జోక్యాన్ని అంగీకరించేవారు కాదు.



దేశంలో స్వయంసమృద్ధి కలిగిన పాడి పరిశ్రమను అభివృద్ధి చేసిన కురియన్, భారత గ్రామీణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసి, గ్రామీణ పేదల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకువచ్చారు. ఈ సహకార వ్యవస్థ లక్షలాది మంది భూమిలేని కూలీలకు, సన్నకారు రైతులకు క్రమం తప్పని ఆదాయాన్ని కల్పించి, దేశంలోని పాల ధరలను స్థిరీకరించింది. దీని వల్ల నేడు దేశంలోని పేదలకు కూడా పరిశుభ్రమైన పాలు, తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చాయి.

1989లో కురియన్‌కు ప్రపంచ పౌరుల ఆహార అవసరాలు తీర్చినందుకు, సమర్థమైన యాజమాన్య నిర్వహణ, సరఫరా వ్యూహాల ద్వారా సహకార వ్యవస్థలో వినూత్నమైన మార్పులు తీసుకువచ్చినందుకుగాను కురియన్‌కు 'ప్రపంచ ఆహార పురస్కారాన్ని' ప్రకటించారు. కురియన్ నమూనా కింద 1960లో 20 మిలియన్ మెట్రిక్ టన్నులున్న దేశ పాల ఉత్పత్తి 2011 నాటికి 120 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుని, మన దేశం ప్రపంచంలోనే అత్యధికంగా పాలను ఉత్పత్తి చేసే దేశంగా పేరు సంపాదించింది.

కురియన్ పాడి పరిశ్రమ రంగంలో ప్రారంభించిన సహకార ఉద్యమం దేశంలో అనేక సహకార ఉద్యమాలకు ప్రేరణనిచ్చింది. సహకార పద్ధతిలో, సభ్యుల నియంత్రణలో నడిచే అమూల్ సుస్థిర అభివృద్ధికి ఒక సజీవ ఉదాహరణగా నిలిచింది. అనేక సంస్థలు అమూల్ సహకార నిర్వహణను అభ్యసించడానికి అమూల్‌ను సందర్శించడం ప్రారంభించాయి. రష్యా, బ్రిటన్, పాకిస్తాన్, శ్రీలంక దేశాల ప్రతినిధులు అమూల్‌ను సందర్శించి తమ దేశంలో కూడా సహకార సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సహకరించాలని కురియన్‌కు విజ్ఞప్తి చేశాయి.

పాడి పరిశ్రమ సహకార సంఘాల అనంతరం కురియన్ ఈ నమూనాను 1980వ దశకంలో వంట నూనెల రంగానికి అన్వయించాలని భావించారు. అప్పట్లో వంటనూనె రంగాన్ని దేశంలోని కొన్ని కుటుంబాలే శాసించేవి. తన జీవితం తదుపరి కాలంలో కురియన్ సరళీకృత ఆర్థిక విధానాలను తప్పపట్టారు. దీని వల్ల మన సంస్థలు బహుళజాతి కంపెనీలతో పోటీ పడలేకపోతున్నాయని విమర్శించిన కురియన్, అనేక సమావేశాలు, ఇంటర్వ్యూలలో సరళీకరణ, ప్రపంచీకరణలకు వ్యతిరేకంగా మాట్లాడేవారు.

ఆనంద్ తరహా సహకార సంఘాలు దేశంలో ప్రాచుర్యం పొందలేకపోయాయి అన్న విషయాన్ని అనేకసార్లు అంగీకరిస్తూనే ఆయన దీనికి

బలమైన కారణాలను వివరించేవారు. "ప్రజాస్వామ్య పాలన దేశంలో అన్ని చోట్లా సమర్థవంతంగా నడుస్తోందా? ప్రజాస్వామ్య సమస్యలకు పరిష్కారం మరింత ప్రజాస్వామ్యమే. గ్రామ సహకార సంఘంలాంటి మరిన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను నెలకొల్పడం ద్వారా తప్ప దేశంలో ప్రజాస్వామ్యం మనలేదు".

దేశాన్ని పాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపి, పాల ద్వారా వచ్చే ఆదాయాన్ని దేశ స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం, స్థూల జాతీయ వ్యవసాయోత్పత్తిలో 26 శాతంగా చేసిన డాక్టర్ వర్ఘీస్ కురియన్, 90 ఏళ్ల వయసులో 2012, సెప్టెంబర్ 9న మరణించారు. ఆయన మరణించేనాటికి ఆయనకు 17 గౌరవ డాక్టరేట్లు, అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. వాటిలో: పద్మశ్రీ (1965); పద్మభూషణ్ (1966); కృషి రత్న (1986); పద్మవిభూషణ్ (1999) కొన్ని. కమ్యూనిటీ లీడర్‌షిప్ కింద ఆయనకు 1963లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో వాటర్లర్ పీస్ ప్రైజ్, 1989లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్, 1993లో అమెరికాలోని విస్కాన్సిన్‌లో జరిగిన వరల్డ్ డైరీ ఎక్స్‌పోలో ఇంటర్నేషనల్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం, 1997 మార్చిలో ఫ్రాన్స్ ప్రభుత్వం ఆర్డర్ దు మెరిట్ ఆగ్రికోల్ పురస్కారం, 2000లో జపాన్ ప్రభుత్వ రీజనల్ అవార్డు లభించాయి.

కురియన్‌కు వృత్తి పట్ల ఉన్న నిబద్ధత, ఆయన విశ్వసనీయత, చేసిన ప్రతి పనీ ఖచ్చితంగా ఉండాలనే పట్టుదలా అద్భుతమైనవి. ఆయన సమస్యలను కూడా అవకాశాలుగా మార్చుకునే మేధావి. చేసిన ప్రతి పనిలోనూ మనదైన ముద్ర ఉండాలని ఆయన భావించేవారు. ప్రజలు అభివృద్ధి చెందాలంటే వారికి మరిన్ని బాధ్యతలు అప్పజెప్పాలనేవారు. ప్రజల సామర్థ్యాలపై, సహకార వ్యవస్థపై ఆయనకు అచంచలమైన విశ్వాసం ఉండేది. పేదరిక నిర్మూలన, ప్రజల అభివృద్ధి సహకార ప్రతిపాదిక పైనే ఆధారపడి ఉన్నాయని ఆయన విశ్వసించేవారు.

కురియన్ అప్పుడప్పుడూ, "సహకార సంఘాలు విఫలమైతే వాటిలో మరింత వృత్తితత్వాన్ని ప్రవేశపెట్టండి. ప్రజాస్వామ్యం విఫలమైతే, మరింత ప్రజాస్వామ్యాన్ని సృష్టించడానికి ప్రయత్నించడమే దానికి పరిష్కారం" అనేవారు. ఈ ప్రపంచంలో నిజాయితీ కలిగిన వ్యక్తిని ఎవరూ ఓడించలేరని కురియన్ నిరూపించారు. నిజాయితీ, వృత్తినైపుణ్యత కలిగిన ఆయన అభివృద్ధి రంగంలో ఆదర్శంగా నిలిచిపోయారు. ✸